సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం | 8 | ఆగస్టు | 2024



టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 837 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



ఆధునిక సేద్యం.. సులభతరం

ఆధునిక యంత్రాల వినియోగంతో వ్యవసాయం సులభతరమైంది. రైతులకు సమయంతో పాటు డబ్బు ఆదా అవుతోంది.

8లో

గరిష్టం/కనిష్టం

29.5°/22.6°

జిల్లాలో బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సొంత జిల్లాకు ఎంపీడీఓలు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



జెడ్పీ కార్యాలయం

అనంతపురం సిటీ: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు వెళ్లిన ఎంపీడీఓలను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మొత్తం 38 మంది ఇతర జిల్లాలకు వెళ్లారు. ఇప్పుడు వారంతా సొంత జిల్లాకు రానున్నారు. కర్నూలు జిల్లా నుంచి 34 మంది, నెల్లూరు నుంచి ఒకరు అనంతపురానికి వచ్చారు. వారు తమ జిల్లాలకు వెళ్లిపోనున్నారు.

పోస్టింగ్స్ కోసం క్యూ..

సొంత జిల్లాకు రానున్న ఎంపీడీఓలు మండలాలు వెతుక్కునే పనిలో పడ్డారు. తాము పని చేయాలనుకున్న మండలాలకు సంబంధించి ఆయా ప్రాంత ఎమ్మెల్యేల అనుమతి కోసం వారి ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు నేరుగా, మరికొందరు తెలిసిన వారి నుంచి ఫోన్లు చేయిస్తూ ఎమ్మెల్యేల నుంచి లెటర్లు సంపాదించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొందరు లెటర్లు దక్కించుకున్నట్లు తెలుస్తోంది.

26 మండలాల్లో వాన

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ 26 మండలాల పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. అమరాపురం మండలంలో అత్యధికంగా 32.4 మి.మీ, గోరంట్ల 28.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే సోమందేపల్లి 17.2, గుడిబండ 13.2, కదిరి 8.8, మడకశిర 8.6, ధర్మవరం 7.4, రామగిరి 5.6, నల్లచెరువు 5.2, కొత్తచెరువు 5, ముదిగుబ్బ, రొళ్ల, పరిగి మండలాల పరిధిలో 4.2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక హిందూపురం మండలంలో 3.8, నల్లమాడ, పుట్టపర్తి మండలాల్లో 3.4 మి.మీ, కనగానపల్లి, ఓడీ చెరువు, చిలమత్తూరు మండలాల్లో 3.2 మి.మీ, బత్తలపల్లి, ఎన్పీ కుంట మండలాల్లో 3.0 మి.మీ, సీకేపల్లి 2.4, గాండ్లపెంట 2.0, తనకల్లు 1.8, తలుపుల 1.6, బుక్కపట్నం మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

అక్రమ మద్యం కేసులో మూడేళ్ల జైలు

పుట్టపర్తి టౌన్: అక్రమ మద్యం సరఫరా కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ పెనుకొండ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే...గోరంట్ల మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే కిష్టప్ప 2020 జూలై 11వ తేదీన కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యాన్ని మోటార్ సైకిల్‌పై అక్రమంగా జిల్లాకు తీసుకువస్తున్నాడు. అదేమార్గంలో వాహనాలు తనిఖీ చేస్తున్న అప్పటి సీఐ జయనాయక్ అనుమానంతో కిష్టప్ప వాహనాన్నీ తనిఖీ చేశారు. 40 టెట్రా ప్యాకెట్ల బెంగుళూరు విస్కీ(90 ఎంఎల్) లభించగా, వడ్డే కిష్టప్పను అరెస్టు చేసి మోటార్ సైకిల్‌ను సీజ్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ వేశారు. ప్రస్తుత సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్టేషన్ పీసీలు కరుణాకర్‌రెడ్డి, భాస్కర్ సకాలంలో సాక్ష్యాధారాలను కోర్టు ఎదుట ప్రవేశపెట్టారు. అలాగే పెనుకొండ కోర్టు ఏపీపీ శ్యామల వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో పెనుకొండ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి బుజ్జప్ప గురువారం తీర్పు వెలువరించారు. వడ్డే కిష్టప్పకు మూడేళ్ల జైలు శిక్ష విధించడంతో పాటు రూ.2 లక్షల జరిమానా విధించారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేలా చేసిన ఏపీపీ శ్యామల, సీఐ సుబ్బరాయుడులను ఎస్పీ రత్న ప్రత్యేకంగా అభినందించారు.

పండ్ల తోటలకు ప్రాధాన్యమివ్వండి




కూలీలతో మాట్లాడుతున్న పీడీ విజయ ప్రసాద్

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో పండ్ల తోటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని డ్వామా పీడీ విజయ ప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన నిమ్మలకుంట గ్రామంలో పర్యటించారు. 'చింత-నిశ్చింత' తోపులో చింత చెట్ల చుట్టూ తవ్వుతున్న నీటి కందకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో ఆయన మాట్లాడుతూ, ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దినసరి వేతనం రూ.300 వచ్చే విధంగా పనులు చేసుకోవాలన్నారు.

అమ్మకు కడుపు కోత

- ధర్మవరానికి చెందిన ఓ యువతి 20 ఏళ్ల వయసులో గర్భం దాల్చింది. సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేది. ప్రసవ సమయంలో సిజేరియన్ చేశారు. ఆ తర్వాత ఆరోగ్యం విషమించిందని.. పది రోజుల పాటు అక్కడే అడ్మిట్ చేసుకుని సుమారు రూ.90 వేలు బిల్లు రూపంలో వసూలు చేసినట్లు బాధితురాలు తెలిపింది. సిజేరియన్ కారణంగా పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఆ మహిళ పేర్కొంది.
- హిందూపురానికి చెందిన 26 ఏళ్ల గర్భిణి ప్రతి నెలా స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకునేది. సాధారణ ప్రసవం చేస్తామని.. నమ్మబలికి పలు రకాల ఔషధాలు ఇచ్చేవారు. అయితే ప్రసవం రోజున సాధారణ కాన్పు సాధ్యం కాదని అక్కడి వైద్యులు చేతులెత్తేశారు. వెంటనే సిజేరియన్ చేయకపోతే తల్లీబిడ్డ ప్రాణాలకే ప్రమాదమని భయపెట్టారు. దీంతో ఏం చేయాలో తెలియని మహిళ బంధువులు అందుకు అంగీకరించి వారు అడిగినంత ముట్టజెప్పారు.



2023 ఏప్రిల్ నుంచి జిల్లాలో ప్రసవాల వివరాలు ఇలా...			
ప్రభుత్వాస్పత్రుల్లో	సాధారణ కాన్పు	సిజేరియన్ కాన్పు	మొత్తం
	5,947	1,875	7,822
ప్రైవేటు ఆస్పత్రుల్లో	8,501	7,046	15,547

- ప్రైవేటు ఆస్పత్రుల్లో పెరుగుతున్న సిజేరియన్లు
- సాధారణ ప్రసవాలపై ప్రైవేటు డాక్టర్ల నిర్లక్ష్యం
- ఆస్పత్రికి వెళ్లిన వారిలో సగం మందికి కోతలే
- భయపెట్టి 'క్యాష్' చేసుకుంటోన్న ప్రైవేటు డాక్టర్లు



సాక్షి, పుట్టపర్తి

జిల్లాలోని కొందరు ప్రైవేటు వైద్యులు వృత్తి ధర్మాన్ని మరిచారు. కాసుల కోసం కక్కుర్తి పడి అమ్మలకు కడుపుకోత పెడుతున్నారు. సాధారణ ప్రసవం అయ్యే అవకాశం ఉన్నా...గర్భిణి బంధువులను భయపెట్టి బలవంతంగా సిజేరియన్ చేస్తున్నారు. ఇందుకు గాను బిల్లు రూపంలో రూ.లక్షలు లాగుతున్నారు. ఒక్కోసారి చివరి నిమిషంలో చేతులెత్తేస్తూ ఎందరినో క్షోభ పెడుతున్నారు.

అనవసర సిజేరియన్‌లతో అనర్థాలెన్నో...

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కువగా సాధారణ ప్రసవాలే జరుగుతున్నాయి. కానీ ప్రైవేటులో మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో సాధారణ ప్రసవాలు జరగడం లేదు. వైద్యఆరోగ్యశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రకారం మొత్తం ప్రసవాల్లో 15 శాతం లోపు మాత్రమే సిజేరియన్లు ఉండాలి. కానీ జిల్లాలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచీ ప్రైవేటు ఆస్పత్రుల్లో నెలవారీ పరీక్షలు చేయించుకుంటున్నా...చివర్లో మాత్రం వైద్యులు సిజేరియన్‌కే సిద్ధం కావాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారు. ఈ అనవసర ప్రసవాల ప్రభావం బాధితులపై జీవితాంతం చూపుతోంది. డబ్బు సంగతి పక్కన బెడితే మహిళలు చిన్న వయసులోనే అనారోగ్యం బారిన పడుతున్నారు. సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాల్సిన అధికారులూ నిర్లక్ష్యంగా ఉన్నారు.

అదును చూసి 'క్యాష్' చేసుకుంటూ..

చాలామంది మహిళలు అవగాహన లోపంతో సరైన ఆహారం తీసుకోని కారణంగా గర్భం దాల్చిన సమయంలో పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో మొదటి నెల నుంచే చాలామంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు వైద్యులు పౌష్టికాహారం గురించి చెప్పడం పక్కనపెట్టి వారిని మెడిసిన్‌కు అలవాటు చేస్తున్నారు. దీంతో గర్భిణులూ తమ ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. ఫలితంగా ప్రసవ సమయంలో అదే ఆస్పత్రిలోనే తప్పనిసరి పరిస్థితుల్లో సిజేరియన్ చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. కొందరు ప్రైవేటు వైద్యులయితే మరీ దిగజారి గర్భిణి బంధువులను భయపెడుతున్నారు. వెంటనే సిజేరియన్ చేయకపోతే ఏం చెప్పలేం అంటూ రూ.లక్షలు పోగేసుకుంటున్నారు. ఇక మరికొందరు మాత్రం ఫలానా తేదీ...ఫలానా సమయానికి ప్రసవం చేయాలని కోరుతుండటంతో వైద్యులు సిజేరియన్ చేసి బిడ్డను చేతిలో పెడుతూ భారీ మొత్తం తీసుకుంటున్నారు.

దృష్టి సారిస్తాం



ఏ ఆస్పత్రుల్లోనైనా సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. పేరు నమోదు చేసుకున్న నాటి నుంచి కాన్పు జరిగే వరకు గర్భిణి ఆరోగ్య పరిస్థితిపై శ్రద్ధ తీసుకోవాలి. నమోదైన ప్రసవాల్లో 15 శాతం కంటే మించి సిజేరియన్లు ఉంటే అలాంటి ఆస్పత్రులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి అనవసరంగా ఇబ్బందులు పడొద్దు.

– డాక్టర్ మంజువాణి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

అవగాహన కల్పిస్తాం



పౌష్టికాహార లోపం, రక్తహీనత వల్లే గర్భిణులకు ఇబ్బందులు తలెత్తుతాయి. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచే పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యుల సూచనలు పాటిస్తే సాధారణ ప్రసవానికి ఇబ్బంది ఉండదు. మా వద్దకు వచ్చే గర్భిణులకు అవగాహన కల్పించి మంచి ఆహారం తీసుకునేలా చూస్తాం. అందుకే ఇక్కడ ఎక్కువగా సాధారణ ప్రసవాలే జరుగుతాయి. జనం కూడా అనవసరంగా ప్రైవేటు ఆస్పత్రుల బాట పట్టొద్దు.

– బాబాబుడెన్, గైనకాలజిస్టు, హిందూపురం ఆస్పత్రి

ఉద్యోగులంతా చేనేత వస్త్రాలు ధరించాలి

- నేతన్నలకు మేలు చేసే ప్రతి అంశాన్ని పరిశీలిస్తాం
- జాతీయ చేనేత దినోత్సవంలో జేసీ అభిషేక్‌కుమార్



పట్టు చీరను పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: మన సంప్రదాయాన్ని కాపాడుకోవడంతో పాటు నేతన్నలకు మంచి జరిగేలా ఉద్యోగులంతా వీలైనంత వరకూ చేనేత వస్త్రాలు ధరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ కార్మికులు, అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏడుగురు చేనేత కార్మికులు, డిజైనర్లను సత్కరించారు. కలెక్టరేట్ ఆవరణలో చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ కుమార్ చీరల తయారీ, వాటి అమ్మకాలు, ఎగుమతులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కార్మికునికీ ప్రభుత్వం మంజూరు చేసే అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. నేతన్నకు మేలుచేసే ప్రతి అంశాన్నీ పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ అధికారి రమేష్, పట్టు పరిశ్రమశాఖ అధికారి పద్మమ్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఖయ్యూం, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి: వ్యాపార నిర్వహణ, శక్తి సామర్థ్యాలపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉచితంగా శిక్షణ ఇస్తోంది. బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12న ప్రారంభం కానున్న శిక్షణ తరగతులు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం, సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మక్బుల్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ఎస్‌ఎంసీ ఎన్నికలు

- విద్యార్థుల తల్లిదండ్రులే ఓటర్లు
- చైర్మన్ కుర్చీపై అధికార టీడీపీ నేతల కన్ను
- తమ వారే ఆ పదవిలో ఉండాలంటూ హెచ్‌ఎంలపై ఒత్తిడి
- అవసరమైతే ఎన్నిక వాయిదా వేయాలంటూ హుకుం



2,061 జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు

1.46 లక్షలు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు

కదిరి/మడకశిర: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు జరగనున్నాయి. గతంలో ఎన్నుకున్న కమిటీల రెండేళ్ల కాలపరిమితి ముగియడంతో కొత్త కమిటీల నియామకానికి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మధ్యాహ్నం తర్వాత చైర్మన్ ఎన్నిక..

జిల్లాలో 2,061 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో ప్రాథమిక పాఠశాలలు 1,548, ప్రాథమికోన్నత పాఠశాలలు 230, ఉన్నత పాఠశాలలు 283 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలకు విద్యాశాఖ అధికారులు ఈ నెల 1వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. పూర్తి సమాచారాన్ని ఆయా పాఠశాలల్లోని నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించారు. 5వ తేదీన ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు కూడా స్వీకరించారు. అనంతరం అదేరోజు సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య తుది ఓటరు జాబితాను ప్రకటించారు. గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ముందే ఎన్నికలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎన్నికైన సభ్యుల్లో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా సభ్యులు ఎన్నుకోనున్నారు. వీరితో హెచ్ఎం ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం 3 గంటలకు నూతన ఎస్ఎంసీ కమిటీ తొలి సమావేశం నిర్వహిస్తారు. ఇప్పటికే పాఠశాల హెచ్‌ఎంలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులు కూడా నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సంబంధించిన సమాచారం అందించారు.

అన్ని చోట్లా మావాళ్లే ఉండాలి..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఎస్ఎంసీ ఎన్నికలను టీడీపీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అన్ని కమిటీల్లోనూ తమవారే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఉండాలని భావిస్తున్నారు. అయితే ఎస్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసే వారి పిల్లలు తప్పకుండా ఆ పాఠశాలలో చదువుతూ ఉండాలన్న నిబంధన వారికి ఇబ్బందిగా మారింది. దీనిపై జిల్లాలో కొన్ని చోట్ల స్థానికంగా ఉన్న అధికార టీడీపీ నాయకులు 'రూల్స్ పక్కన బెట్టి కచ్చితంగా మా పార్టీకి చెందిన వారే ఎస్ఎంసీ చైర్మన్‌గా ఉండేలా చూడండి. అది కూడా మేము చెప్పిన వారినే ఎన్నుకోవాలి. లేదంటే మీరు మా ఊరిలో ఉద్యోగం చేయలేరు' అని పాఠశాల ప్రధానోపాధ్యాయులపై బెదిరింపుల పర్వానికి దిగినట్లు సమాచారం. ఇక జిల్లాలోని ఓ టీడీపీ శాసనసభ్యుడు తన నియోజకవర్గంలోని అందరు ఎంఈఓలకు ఫోన్ చేసి 'అన్ని చోట్లా మా వాళ్లే ఉండేలా చూడండి. మీరు నిబంధనల పేరుతో వైఎస్సార్ సీపీ వారిని చైర్మన్‌గా పెడితే ఊరుకునేది లేదు. మా పార్టీ వారిని చైర్మన్‌గా చేయడం కుదరని పక్షంలో అవసరమైతే ఎన్నికలు వాయిదా వేయండి. తర్వాత పోలీసులను పెట్టి ఎన్నికలు జరుపుదాం' అని గట్టిగా హెచ్చరించినట్లు ఉపాధ్యాయులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

నిబంధనలు ఇలా..

- ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు 50 శాతం మంది తల్లిదండ్రులు హాజరుకావాలి.
- ఓటింగ్‌లో మొదటి ప్రాధాన్యత విద్యార్థి తల్లికి ఉంటుంది. ఆమె హాజరుకాని పక్షంలో తండ్రి రావచ్చు. లేదంటే సంరక్షకుడు పాల్గొనవచ్చు. వీరిలో ఒకరికి మాత్రమే ఓటుహక్కు ఉంటుంది.
- తుది ఓటర్ల జాబితా ప్రకటించిన తర్వాత అంటే ఈ నెల 5వ తేదీ తర్వాత బడిలో చేరిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఓటింగ్‌లో పాల్గొనేందుకు అర్హులు కాదు.
- ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉండాలి. అలాగే ముగ్గురిలో ఒకరు కచ్చితంగా ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, మరొకరు బీసీ, ఈబీసీ, మైనార్టీ వర్గానికి చెందిన వారై ఉండాలి.
- చేతులు ఎత్తడం ద్వారా గానీ లేదంటే నోటితో చెప్పడం ద్వారా గానీ ఎన్నిక నిర్వహిస్తారు. గొడవలకు అవకాశం ఉందని భావిస్తే రహస్య బ్యాలెట్ విధానాన్ని అవలంభిస్తారు.
- ఎన్నికైన సభ్యుల నుంచే చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఒకరు వెనుకబడిన సమూహం లేదా బలహీన వర్గానికి చెందిన వారై ఉండాలి. వీరిద్దరిలో ఒకరు కచ్చితంగా మహిళ ఉండాలి.
- ఎన్నికైన నూతన కమిటీ పదవీ కాలం రెండేళ్లు ఉంటుంది. ఒకవేళ ఎన్నికైన చైర్మన్ లేదా వైస్ చైర్మన్ పిల్లలు ఈ బడిని వదిలి మరో చోటికి వెళితే అప్పుడు వారు ఇక్కడ పదవిలో కొనసాగడానికి వీల్లేదు.
- స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారు, హెచ్ఎం, ఇన్‌చార్జ్ హెచ్ఎం, టీచర్లు ఓటింగ్‌లో పాల్గొన కూడదు.
- ఎస్ఎంసీలో ఎక్స్‌అఫిషియో సభ్యుడి హోదాలో పాఠశాల హెచ్ఎం కన్వీనర్‌గా ఉంటారు. అలాగే హెచ్ఎం పురుషుడైతే మరో మహిళా టీచర్‌ను, హెచ్ఎం మహిళ అయితే పురుష టీచర్‌ను ఒకరిని ఎంఈఓ నామినేట్ చేస్తారు. మున్సిపాలిటీలో వార్డు కౌన్సిలర్, గ్రామంలో వార్డు మెంబర్, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, గ్రామ లేదా వార్డు సమాఖ్య అధ్యక్షురాలు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉంటారు.
- ఒక విద్యావేత్త లేదా స్వచ్ఛంద సంస్థ సభ్యులు లేదంటే పూర్వ విద్యార్థి ఒకరిని కోఆప్టెడ్ సభ్యులుగా తీసుకుంటారు.
- మున్సిపల్ చైర్‌పర్సన్ లేదా గ్రామ సర్పంచ్ పేరెంట్ మానిటరింగ్ కమిటీ సమావేశాలకు హాజరుకావచ్చు.

ఎన్నికలకు సర్వం సిద్ధం



జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8వ తేదీన ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందు కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థుల తల్లిదండ్రులే ఈ ఎన్నికల్లో పాల్గొని వారిలో ఒకరిని ఎస్ఎంసీ చైర్మన్‌గా, ఇంకొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఇందులో రాజకీయ జోక్యం ఉండదు. ఈ నెల 5న అభ్యంతరాలు స్వీకరించిన మీదట తుది ఓటర్ల జాబితా ఆయా పాఠశాలల నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించాం.

– మీనాక్షి, డీఈఓ

వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఇందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో అడిషనల్ ఎస్పీ విష్ణు, జేసీ అభిషేక్ కుమార్, డీఆర్ఓ కొండయ్యతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఆగస్టు 15వ తేదీ గురు వారం స్థానిక శిరసాని హిల్స్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదన్నారు. పరేడ్ గ్రౌండ్ మైదానాన్ని శోభాయమానంగా తీర్చి దిద్దడంతో పాటు అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జాతీయ పతాకావిష్కరణ చేస్తారన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వేదిక, తగిన సీటింగ్, వీఐపీలకు ప్రత్యేక వేదిక, శానిటేషన్, తాగునీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లు, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ, రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగుల వివరాలను అందజేయాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వ పథకాల ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి శాఖకు సంబంధించి ప్రగతి నివేదికలను జిల్లా ప్రణాళిక అధికారికి వీలైనంత త్వరగా అందజేయాలన్నారు. అదే రోజు అన్నా క్యాంటిన్ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. సమావేశంలో ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ విజయ్‌కుమార్, సీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, డీఈఓ మీనాక్షితో పాటు పలుశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

జిల్లాలో అర్హులందరూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చేతన్ సూచించారు. ఈ పథకంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాంప్రదాయ చేతి వృత్తులపై ఆధారపడిన వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కేంద్రం పీఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. 2028 వరకూ అమలులో ఉండే ఈ పథకానికీ నిధులు కూడా భారీగా కేటాయించిందన్నారు. పథకానికి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, ఎల్‌డీఎం రమణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పక్కాగా చేయాలి

ధర్మవరం రూరల్: ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటల వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక పట్టుశాఖ కార్యాలయ సమావేశ భవనంలో ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లోని ధర్మవరం, రామగిరి, కనగానపల్లి, సీకేపల్లి, తాడిమర్రి, బత్తలపల్లి మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రం సిబ్బంది, వ్యవసాయాధికారులకు ఈ-క్రాప్ నమోదుపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ, రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలన్నారు. ఏ గ్రామంలో ఎప్పుడు ఈ-క్రాప్ ఉంటుందో రైతులకు ముందుగానే తెలియజేయాలన్నారు. సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్య, ఏఓలు ముస్తఫా, ఓబిరెడ్డి, రమాదేవి, కృష్ణకుమారి, మురళీ, ఏఈఓలు ఉపేంద్ర, రియాజ్, అశ్విని, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈ-క్రాప్ నమోదుపై సిబ్బందికి సూచనలిస్తున్న డీఏఓ సుబ్బరావు

క్లుప్తంగా

ఘనంగా గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు



తిరువీధుల్లో దర్శనం ఇస్తున్న ఖాద్రీశుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదారుగా ఆలయ మాజీ చైర్మన్ శ్రీహరి ప్రసాద్ వ్యవహరించారు. శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభునికి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బంగారు పతకాలతో మెరిసిన పావగడ వాసి



ఆరు బంగారు పతకాలు అందుకుంటున్న రాము

పావగడ: తాలూకాలోని క్యాతగానచెర్లు గ్రామానికి చెందిన బోయ ముత్యాలప్ప, నరసమ్మ దంపతుల కుమారుడు రాము ఒకేసారి 6 బంగారు పతకాలు అందుకుని పావగడ కీర్తి ప్రతిష్టలు పెంచారు. తుమకూరు విశ్వవిద్యాలయంలో కన్నడ ఎంఏలో ఆయన ప్రథమ ర్యాంక్ సాధించారు. దీంతో బుధవారం జరిగిన ఆ వర్సిటీ 17వ స్నాతకోత్సవంలో వైస్ చాన్సలర్ చేతుల మీదుగా ఆయన ఆరు బంగారు పతకాలు అందుకున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాయదుర్గంటౌన్: ప్రియుడు పెట్రోల్ పోసి నిప్పటించిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... స్థానిక రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన మోహన్ అదే ప్రాంతానికి చెందిన పార్వతి (40)తో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ఆమెకు దూరంగా ఉంటూ వచ్చిన మోహన్... మంగళవారం సాయంత్రం పార్వతిపై పెట్రోల్‌పోసి నిప్పంటించాడు. ఘటనలో దాదాపు 70 శాతం కాలిన గాయాలతో అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం మధ్యాహ్నం మృతి చెందింది. కాగా, ఘటనకు సంబంధించి రాయదుర్గం ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స పొందుతున్న సమయంలోనే రాయదుర్గం జడ్జి వద్ద ఆమె ఇచ్చిన వాగ్మూలం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆధునిక సేద్యం.. సులభతరం

సంప్రదాయ సాగు పద్ధతుల నుంచి ఆధునిక వ్యవసాయం వైపు అన్నదాత దృష్టి మళ్లింది. ఇటీవల నూతన వ్యవసాయ విధానాలు, యంత్రాల వినియోగం పెరగడమే ఇందుకు నిదర్శనం. గ్రామాల్లో గతంలో ఎన్నడూ చూడని విధంగా మల్చింగ్, డ్రిప్, పాలిహౌస్‌ల వంటివి అధికంగా కన్పిస్తున్నాయి. ఇంకోవైపు సాగు పద్ధతుల్లోనూ అనేక మార్పులు వచ్చాయి. విత్తనాలు విత్తే దగ్గర నుంచి నాట్లు వేయడం, కోతలు కోయడం, నూర్పిడి చేయడం వంటి అన్ని పనుల్లోనూ యంత్రాల వినియోగం కనిపిస్తోంది.

- నూతన వ్యవసాయ విధానాలపై ఆసక్తి
- పెరిగిన యంత్రాల వినియోగం



మిషన్‌తో వరి పంటను కోస్తున్న దృశ్యం



గొర్రుతో విత్తనాలు వేస్తున్న రైతులు

పుట్టపర్తి అర్బన్: పంటలే ప్రాణంగా భావించే రైతన్నలు కొత్త పుంతలు తొక్కుతూ సులభ మార్గాల ద్వారా వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నారు. ఎంతో కష్టంగా భావించే వ్యవసాయాన్ని గత ప్రభుత్వ సహకారంతో సులభతరం చేశారు. సేద్యంలో ఆధునికత సంతరించుకోవడంతో విద్యావంతులు సైతం పంటల సాగుపై దృష్టి సారించారు. పెట్టుబడులకు వెనుకంజ వేయకుండా ముందుకొచ్చే యువ రైతులు నూతన ఒరవడితో ఆదర్శంగా నిలుస్తున్నారు. విత్తు మొదలు కోతల వరకూ యంత్రాలను విరివిగా వినియోగిస్తూ పంటల సాగు చేపట్టి లాభాలు గడిస్తున్నారు.

అన్ని పనులూ యంత్రాలతోనే..

జిల్లాలో అత్యధికంగా వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరితో పాటు మామిడి, చీనీ, జామ, బొప్పాయి, కూరగాయలు, దోస, కళింగర, టమాట లాంటి ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. అయితే కూలీల కొరత ఎక్కువగా ఉన్న ప్రస్తుత రోజుల్లో యంత్రాల సహకారంతో పంటల సాగు చేపట్టారు. విత్తన గొర్రు, వరి మడి దున్నకం, నాటడం, చివరకు కోతల సమయంలోనూ యంత్రాలనే వాడుతున్నారు. కలుపు అధికంగా ఉన్న పంటల్లో డ్రోన్‌ల సాయంతో మందులు పిచికారీ చేపట్టి కూలీల కొరతను అధిగమిస్తున్నారు.

ఆధునిక వ్యవసాయానికి సాయం..

గత ఐదేళ్లలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని విధాలుగా రైతులను ప్రోత్సహిస్తూ వచ్చారు. వ్యవసాయ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, నూర్పిడి యంత్రాలు, వరి కోత మిషన్లు, మందుల పిచికారీకి స్ప్రేయర్లు వంటివి రాయితీతో అందజేశారు. దీంతో జగన్ హయాంలో 280కు పైగా ట్రాక్టర్లు, వందల కొద్దీ వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని సొంతదారులు వ్యవసాయంలో ఉపయోగించడంతో పాటు ఇతరులకు అద్దెకు ఇచ్చి మరింత ఆదాయాన్ని గడిస్తున్నారు. జిల్లాలో వరి, మొక్కజొన్న పంటలను కోయడానికి ఉపయోగించే యంత్రాల ధరలు ఎక్కువగా ఉండడంతో తమిళనాడు నుంచి అద్దెకు తీసుకువచ్చి ఉపయోగిస్తున్నారు. ట్రాక్టర్, రోటోవేటర్, పొలం దుక్కి... చదును చేయడానికి, విత్తన గొర్రు, వలస మణి, కోత మిషన్లు, మందుల పిచికారీకి ఇంత వరకూ చూడని స్ప్రేయర్లు వాడుతుండగా ఇటీవల డ్రోన్‌ల ద్వారా పిచికారీ ఊపందుకుంది. ఈ యంత్రాలకు గంటకు రూ.1వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ అద్దె వసూలు చేస్తున్నారు.

సమయం ఆదా..

వ్యవసాయ యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చిన తర్వాత సమయం చాలా వరకూ ఆదా అవుతోందని రైతులు అంటున్నారు. గతంలో 5 ఎకరాల విస్తీర్ణంలో విత్తనం వేయడానికి ఎద్ల సాయంతో రెండు రోజుల సమయం పట్టేది. ప్రస్తుతం ట్రాక్టర్ సాయంతో గంటల వ్యవధిలోనే పని పూర్తవుతోంది. వరి పంటను కోసి నూర్పిడి చేయాలంటే చాలా మంది కూలీలతో పాటు వారాల తరబడి సమయం పట్టేది. అదే నూర్పిడి యంత్రాలతో గంటల వ్యవధిలోని పని చక్కబెట్టేస్తున్నారు. స్ప్రేయర్లతో మందుల పిచికారీ చేసే సమయంలో డ్రమ్ములకు నీళ్లు పోయడం, మందులు కలిపి పిచికారీకి రోజంతా సమయం పట్టేది. ప్రస్తుతం డ్రోన్‌ల వినియోగంతో పిచికారీ చేపట్టి వ్యవసాయాన్ని సులభతరం చేసేశారు. యంత్రాలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి నీటి ఆదరువు ఉన్న రైతులు కూరగాయలు, గిట్టుబాటు అయ్యే పంటలను సాగు చేస్తున్నారు. వ్యవసాయంలోనే గాక ఆవులు, గేదెల పాలు పితకడానికి, గడ్డి కోయడానికి, గడ్డి కత్తిరించడానికి సైతం యంత్రాలు అందుబాటులోకి వచ్చేశాయి.

సబ్సిడీతో యంత్రాలు అందజేశారు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.15 లక్షల విలువ చేసే ట్రాక్టర్, వేరుశనగ నూర్పిడి యంత్రం, రోటోవేటర్, మడకలు మంజూరైంది. 40 శాతం సబ్సిడీ మొత్తాన్ని వెంటనే అందజేశారు. యంత్రాలతో వ్యవసాయం చాలా సులువైంది. ఇప్పుడు నా వద్ద ఉన్న యంత్రాలను సొంతానికి వాడుకోవడంతో పాటు పలువురు రైతులకు అద్దెకు ఇస్తున్నాను.

– ఈశ్వరరెడ్డి, రైతు, పుట్టపర్తి

పని సులువైంది



నేను ఉన్నది గోరంట్ల. ఉద్యోగంలో ఉన్నప్పుడే కొట్లపల్లి వద్ద కొంత భూమి కొనుగోలు చేశాను. హెచ్‌ఎంగా ఉద్యోగ విరమణ పొందిన తర్వాత దాదాపు 12 ఎకరాల్లో వేరుశనగతో పాటు పండ్ల తోటలు, కూరగాయలు పండిస్తున్నా. యంత్రాల వినియోగంతో పని సులువైంది.

– రామచంద్రారెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం, గోరంట్ల

వ్యవసాయమే మేలు



సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నా. అయితే వ్యవసాయ యాంత్రీకరణతో ఉద్యోగం కంటే పంటల సాగునే మేలు అనిపిస్తోంది. మా సొంత భూమిలో బోర్లు వేసి పంటల సాగు చేస్తున్నా. ప్రతి పనికీ యంత్రాలను ఉపయోగిస్తున్నా. సంప్రదాయ పంటలతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలు, మహాగని, శ్రీగంధం వంటి మొక్కలు పెట్టాను.

– అమర్‌నాథరెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బీడుపల్లి, పుట్టపర్తి మండలం

అందుబాటులో అన్ని యంత్రాలు



సేద్యంలో ఉపయోగపడే అన్ని రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని కొనుగోలు చేయవచ్చు లేదా అద్దెకు తీసుకొని ఉపయోగించుకోవచ్చు. యంత్రా వినియోగం ద్వారా కూలీల సంఖ్యతో పాటు సమయమూ ఎంతో ఆదా అవుతుంది. టెక్నాలజీని ఉపయోగించి చాలా మంది విద్యావంతులు సైతం వ్యవసాయ బాట పట్టడం సంతోషదాయకం.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

ముత్యాలమ్మ ఆలయానికి రూ.89 లక్షల ఆదాయం

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయ ఆదాయ వనరులపై బుధవారం నిర్వహించిన వేలం ప్రక్రియ ద్వారా రూ.89.65 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. గదులు, కొబ్బరిచిప్పలు, ఐస్‌క్రీమ్, కంది బేడలు, బియ్యం తదితర వాటికి సంబంధించి వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



గంగాధర్ (ఫైల్)

హిందూపురం అర్బన్: ఒంటరి జీవితాన్ని తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం మండలం కగ్గల్లుకు చెందిన గంగాధర్ (24) తల్లి కొన్ని రోజుల క్రితం మృతి చెందింది. ఈ క్రమంలో తండ్రి మరో మహిళను పెళ్లి చేసుకుని బెంగళూరుకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తున్న గంగాధర్ మానసికంగా కుదేలయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మంగళవారం రాత్రి తన చిన్నాన్న కుమార్తె సెల్‌ఫోన్‌కు మెసేజ్ పెట్టిన అనంతరం నేరుగా పట్టాలపైకి చేరుకుని బసవ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ సమాచారంతో బుధవారం ఉదయం ఘటనా స్థలానికి జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ నాయక్ చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మోసగాళ్ల అరెస్ట్

తాడిమర్రి: లీజు పేరుతో రైతులను మోసగించి ట్రాక్టర్లను తీసుకెళ్లి విక్రయించి సొమ్ము చేసుకున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను తాడిమర్రి ఎస్‌ఐ నాగస్వామి బుధవారం వెల్లడించారు. పెసల నాగమల్లారెడ్డి, తలారి రామలింగేశ్వరరావు, పాణ్యం మల్లికార్జునరెడ్డి కొన్ని రోజుల క్రితం మండలంలోని పలువురు రైతుల వద్ద నుంచి ట్రాక్టర్లను లీజుకు తీసుకెళ్లారు. వాటిలో కొన్నింటిని విక్రయించారు. మిగిలిన వాటిని తాకట్టు పెట్టి డబ్బు చేసుకున్నారు. దీనిపై బాధిత రైతు దేవర రామ్మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 57 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తప్పించుకు తిరుగుతున్న ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

పల్మనరీ విభాగానికి ఐదు పీజీ సీట్లు

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: అనంతపురం బోధనాస్పత్రి పల్మనరీ విభాగానికి కొత్తగా ఐదు పీజీ సీట్లు మంజూరైనట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. దీంతో వైద్య కళాశాలలో పీజీ సీట్ల సంఖ్య 117కు చేరిందన్నారు. బుధవారం కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా బోధనాస్పత్రికి పీజీ సీట్లు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం అనాటమీ 9, ఫిజియాలజీ 4, బయోకెమిస్ట్రీ 2, పెథాలజీ 4, మైక్రో బయాలజీ 11, ఫార్మకాలజీ 7, ఫోరెన్సిక్ మెడిసిన్ 2, ఎస్‌పీఎం 3, జనరల్ మెడిసిన్ 9, జనరల్ సర్జరీ 8, ఆర్థోపెడిక్స్ 7, గైనకాలజీ 12, పీడియాట్రిక్ 4, డెర్మటాలజీ 4, సైకియాట్రీ 2, ఈఎన్‌టీ 3, ఆప్తమాలజీ 3, రేడియాలజీ 12, అనస్తీషియా 6 పీజీ సీట్లు ఉన్నాయన్నారు. మూడు సంవత్సరాల పాటు 351 మంది పోస్టు గ్రాడ్యుయేట్స్ వైద్యులు విద్యనభ్యసించేందుకు వీలుగా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావులకు ఈ సందర్భంగా పల్మనరీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పల్మనరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్యలక్ష్మి, డాక్టర్ కావేటి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

బాంద్రా– వేళాంగణి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు



గుంతకల్లు: తమిళనాడులో అత్యంత ప్రసిద్ధి గాంచిన వేళాంగణి ఉత్సవాలకు వెళ్లే ప్రయాణికుల దృష్ట్యా బాంద్రా–వేళాంగణి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గుంతకల్లులో మాత్రమే స్టాపింగ్ ఉందన్నారు. ఈ నెల 27, సెప్టెంబర్ 6వ తేదీల్లో బాంద్రా జంక్షన్ (09093) నుంచి రాత్రి 9.20 గంటలకు బయలుదేరి రెండో రోజు ఉదయం 8.30 గంటలకు రైలు వేళాంగణి చేరుతుందన్నారు. ఈ నెల 29, సెప్టెంబర్ 8వ తేదీల్లో రాత్రి 10 గంటలకు వేళాంగణి జంక్షన్ (09094) నుంచి బయలు దేరి రెండు రోజుల తరువాత మధ్యాహ్నం 3 గంటలకు బాంద్రా జంక్షన్ చేరుతుందన్నారు. ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్ బోగీలతోపాటు జనరల్ బోగీలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

117 జీఓను వెంటనే రద్దు చేయాలి : ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి

ఎన్పీకుంట: ప్రాథమిక పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే జీఓ 117ను రద్దు చేస్తామని గత ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన నాయకులు హామీనిచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత హామీని నెరవేర్చకుండా ఆ జీఓ ప్రకారమే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపడతామని ప్రకటించడం సిగ్గు చేటన్నారు. జీఓ 117ను రద్దు చేసిన తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని, లేకపోతే దశల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజులు, జిల్లా కౌన్సిలర్ రమణానాయక్, నాయకులు వెంకటేశ్వర్లు, రహీం, షరీఫ్, షఫీ, వెంకటరామిరెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అమూల్ పాల సేకరణ కొనసాగించాలి

కదిరి టౌన్: పాడి రైతులు నష్టపోకుండా గత ప్రభుత్వం అమూల్ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని కొనసాగించాలని కూటమి ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 11 నుంచి అనంతపురం, 21 నుంచి చిత్తూరు జిల్లాల్లో పాల సేకరణ నిలుపుదల చేయాలని అమూల్ యజమాన్యంతో పాటు క్షేత్రస్థాయి మహిళ సొసైటీలకు, సేకరణ కేంద్రాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు.

సీపీఐ సీనియర్ నేత ఎంవీ రమణ ఇకలేరు



అనంతపురం అర్బన్: సీపీఐ సీనియర్ నేత ఎంవీ రమణ ఇక లేరు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ప్రస్తుతం ఆయన సీపీఐ రాష్ట్ర సమితి ప్రత్యేక ఆహ్వానితులుగా కొనసాగుతున్నారు. సీపీఐలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమానికి కన్వీనర్‌గా నాయకత్వం వహించారు. జిల్లాపార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర సమితి సభ్యులుగా, కంట్రోల్ కమిషన్ సభ్యులుగా పని చేశారు. ఆయన అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

రాగులపాడు ఎత్తిపోతలకు కృష్ణా జలాలు



రాగులపాడు వద్ద నీటిని పంపింగ్ చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు వద్దకు మంగళవారం రాత్రి కృష్ణా జలాలు చేరుకున్నాయి. అక్కడి నుంచి రెండు పంపుల ద్వారా అధికారులు నీటి పంపింగ్ ప్రారంభించారు. దీంతో కృష్ణా జలాలు జీడిపల్లి రిజర్వాయర్ వైపు పరుగులు తీస్తున్నాయి. రాగులపాడు లిఫ్ట్ నుంచి 565 క్యూసెక్కుల మేర నీటిని పంపింగ్ చేస్తున్నట్లు హంద్రీనీవా ఏఈ హమ్‌దాన్ వెల్లడించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణమ్మ రాకతో భూగర్భ జలాలు పెరగనున్నట్లు పేర్కొన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి హంద్రీనీవా పథకానికి రూ. వేల కోట్లు కేటాయించి కాలువ పనులను పూర్తి చేయడం వల్లే నేడు జిల్లాకు కృష్ణా జలాలు వస్తున్నాయని పలువురు గుర్తు చేసుకున్నారు.

వ్యక్తి బలవన్మరణం

గార్లదిన్నె: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన సూర్యనారాయణరెడ్డి (43) అనంతపురంలోని జొన్నా బిరన్ మార్ట్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న ఇద్దరు పిల్లల చదువులు, అనారోగ్యంతో బాధపడుతున్న భార్య సుజాత చికిత్స కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. సకాలంలో అప్పులు చెల్లించకపోవడంతో వడ్డీలకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. ఈ క్రమంలో అప్పు చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తితో మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

దెబ్బలు తిన్న బాధితులపైనే కేసు!

- చిలమత్తూరులో అధికార పార్టీ దుర్మార్గం
- జీ హుజూర్ అంటూ సహకరించిన పోలీసులు

చిలమత్తూరు: అధికారం అండతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అమాయకులపై ప్రతాపం చూపుతూ దాడులకు దిగుతున్నారు. రక్షించాల్సిన పోలీసులూ టీడీపీ నేతలకు జీ హుజూర్ అంటూ సలాము చేస్తూ బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. చిలమత్తూరు మండలంలోని దేమకేతేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు గోపాలప్ప, ఆయన భార్య శాంతమ్మపై సోమవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు అంజినప్ప, ఆయన బంధువులు దాడికి తెగబడి కొడవళ్లతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో బాధితులు మంగళవారం ఉదయం వెళ్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదుకు వెనకాడిన పోలీసులు ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో మంగళవారం కేసు నమోదు చేశారు. దీంతో టీడీపీ నేతలు అప్పటికప్పుడు గోపాలప్ప కుటుంబీకులే తమపై దాడి చేశారంటూ ఫిర్యాదు చేయడంతో వెనువెంటనే పోలీసుల కేసు నమోదు చేయడం గమనార్హం. బాధితులకు న్యాయం జరగకుండా టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే కేసులు బనాయించినట్లుగా తెలుస్తోంది. దాడి ఏకపక్షంగా జరిగినట్టు గ్రామ ప్రజలందరికీ తెలిసినా, పోలీసు విచారణలో తేలినా.. బాధితులపైనే కేసు నమోదు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


డయాలసిస్ పేషెంట్‌పై దాడి చేశారంటూ...

65 ఏళ్ల వృద్ధురాలు, డయాలసిస్ పేషెంట్ జయమ్మపై గోపాలప్ప కుటుంబ సభ్యులు 9 మంది దాడి చేశారంటూ టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఇంట్లోంచి బయటకు రాలేని ఓ వృద్ధురాలిపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి బలం చేకూర్చేలా సదరు వృద్ధురాలిని తొలుత హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె అపస్మారక స్థితిలో ఉందని వైద్యులకు చెప్పి... బెంగళూరుకు తరలించారు. అక్కడ వారి బంధువుల ఇంట్లో ఆమెను ఉంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లుగా పోలీసులకు చెప్పారు. దీంతో పోలీసులు మంగళవారం రాత్రే వ్యూహాత్మకంగా ఈ ఘటనతో ఎలాంటి సంబంధంలేని 9 మంది గోపాలప్ప బంధువులపై కేసు నమోదు చేశారు.

టీడీపీ కార్యకర్తల ఇసుక దందా

శింగనమల: మండలంలో టీడీపీ నాయకులు సాగిస్తున్న ఇసుక దందా గుట్టును సెబ్ పోలీసులు రట్టు చేశారు. వివరాలు.. శింగనమల మండలం ఉల్లికల్లుకు చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు అక్రమంగా ఇసుకను జేసీబీ సాయంతో తవ్వి టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇరువెందల సమీపంలోని వంక నుంచి రాత్రి సమయంలో ఏకధాటిగా ఇసుకను తరలించే క్రమంలో రైతులు తోటలకు వేసుకున్న పైప్‌లైన్లు పగిలిపోయాయి. దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇసుక తరలింపులపై సెబ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం రాత్రి సెబ్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పట్టుబడిన ఓ టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో ఉల్లికల్లుకు చెందిన టీడీపీ నాయకులు కొందరు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సర్పాల సయ్యాట





మడకశిర రూరల్: మండలంలోని జమ్మానిపల్లిలో బుధవారం నాగేంద్రప్ప ఇంటి వద్ద రెండు పాములు పెనవేసుకుని దాదాపు రెండు గంటల పాటు సయ్యాటలాడాయి. ఇంటి వద్ద కట్టెల్లో పెన వేసుకున్న పాములను చూసిన ప్రజలు పెద్దగా శబ్దాలు చేసినా అవి విడిపోకుండా పక్కనే ఉన్న పిచ్చి మొక్కల్లోకి వెళ్లాయి.